1986 దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకి ఎన్నికైన కథ

అయ్యోచ్చేటు!

ఐ.వి.యస్. అచ్యుత వల్లి

"ఆరుగంటల బస్సెల్లి పోనాది! ఇంకా మీ అయ్య దిగబడలేదేటే?" అంది నర్సమ్మ కూతురు అచ్చాలుతో. సంజవెలుగులు చీకట్లోకి ముసురుకుంటున్న వేళ గుడిసె ముందటి అరుగు మీద దిగాలుగా రోడ్డు వెంపు చూస్తూ కూర్చుంది.

రోడ్డుకి దిగువగా బాగా పల్లంగా వున్న మైదానంలో వున్నాయి వాళ్ల తాటాకుల ఇళ్లు. రోడ్డుమీద బస్సులు ఆపుతారు. "అంకంపల్లి రోడ్డు" అంటూ అరచి బస్సు తలుపు మీద దబదబబాదుతాడు కండక్టరు. అంకంపల్లి అరమైలు వున్నదనగా సిమెంటు రోడ్డు కటూ ఇటూ అయిదారు గజాల చుట్టుకొలతగల మానులతో గంగరావి చెట్లూ అవిసె చెట్లూ వున్నాయి. అంకంపల్లి రోడ్డు వచ్చేసరికి చల్లగా పచ్చటి పెళ్లిపందిరి క్రిందకు వచ్చినట్లు వుంటుంది బస్సులో వున్నవాళ్లకి. "నువ్వు దిగాలుపడబాకే అమ్మా! నాకూ గుబులు మొదలైతంది." అంది అచ్చాలు. దానికి పదహారేళ్లుంటాయి. క్రితం సంవత్సరం పెద్దది అయింది. దానికి కాపురానికి పంపటం కోసరం నర్సమ్మ భర్త యాదాయి రెండు సంవత్సరాలనించీ. కష్టపడి డబ్బులు కూడపెడుతున్నాడు.

"గుట్టమీది నమ్మక్క అత్తారింటికి చీనారేకు పెట్టి అట్టుకెళ్లింది. ఆకుపచ్చాటి రంగు. పెట్టెమూత మీద గులాబిపూవు న్నది. అయ్యా! నాకోటి అట్టుకురా!" అనేది అచ్చాలు. "పెట్టేడు బట్టలున్నాయేటి నీకు! పెట్టె కొనాల్నంటె నలబయి ముప్పయి రూపాయుండాల. అయ్యేట్టె చీనామిఠాయ చేపిస్తే అత్తోరింటికాడ ఘనంగా వుంటాది. రెండీశలు మిఠాయ కొనాలి. బెల్లంది బాగోదు. చీనా పనద్దార మిఠాయే బాగుంటాది. కంటికి జబరుగా అనుతాది" అనేది నర్సమ్మ. నర్సమ్మకి అచ్చాలు పెద్దకూతురు. దాని తర్వాత అయిదారుగురు పిల్లలు పుట్టి అక్కరకు రాకుండాపోయేరు. కడసారికి ఇద్దరు మగపిల్లలు మిగిలారు. వెంకటయ్య, చినయ్య. "మిఠాయే కొనిద్దారి" అనేవాడు యాదాయి.

"అయ్యోవ్!నాను పెట్టె లేకుండా అత్తారి గడప ఎక్కేదిలేదు. నాదిరేసులన్నీ పెట్టెలోఎట్టుకుని తాళమేసుకోవాల. నాకూల్డబ్బులన్నీ డిబ్బీపిడతలో దా పెట్టేనాను. అయిపెట్టేనా పెట్టెకొనాల!" అనేది అచ్చాలు.

"రెండు చీరలు జాకెట్టు ముక్కలు నాలుగు. అల్లుడికి జామారు. చొక్కాయి గుడ్డ. రెండు తువ్వాళ్లు కొనాల. మొదటసారి కూతుర్ని అంపకం పెట్టేటప్పుడు దరిజాగా కనపడాల. లేకపోతే పిల్లదాయిని నీరసంగా చూత్తారు." అనేవాడు యాదాయి. ఎకరంపొలం కౌలుకి తీసుకున్నాడు. తన పొలంపని కాక ఇతరత్రా కూలికి కూడా వెళ్ళేవాడు. నర్సమ్మ, అచ్చాలు కూడా ఊడుపులప్పుడు కోతలప్పుడు కుప్ప మార్పిళ్ళకు కూలి పనులకు వెళ్ళేవారు. ఆ డబ్బులన్నీ మట్టి పిడతలో వేసి దాచేవారు.

"కూతుర్ని అంపకం పెట్టేదెప్పుడు! గేదెదూడలా ఎదిగిపోతోంది!" అని దగ్గిరి వాళ్ల హాస్యాలాడేవాళ్ళు. "ఏదో అన్ని జాగరత చేస్తున్నాము. నాలుగు డబ్బులు కూడేక పాలెం వెళ్లి అన్ని కొనుక్కొచ్చి అంపకం పెట్టెస్తాను" అనేవాడు యాదాయి. ఒకరోజు రుసరుసలాడుతూ వచ్చింది నర్సమ్మ(వియ్యపురాలు)ఈరకత్తె వేరమ్మ! "ఏమల్లా! ఈడేరిన పిల్లదాయిని ఇళ్లల్లుకూకూడుండ బెట్టుకున్నారు. తేరగా దాని కూలి డబ్బులన్ని మూటకట్టేదామనా! మీ అల్లుడు ఈకోతల్లోనయినా ఆడిబారియని అంపకం పెట్టకపోతే ఇంక విషయం పెద్దల్లో పెట్టేస్తానంటున్నాడు. ఆడు అటూఇటూ ఏమన్నా పేయితాలు చేసేడంటే మాము జబాబుదారీలము కాము. కోడెదూడ లాగున్నాడు మరీ" అని ఎగిరింది వీరమ్మ! కోడలు కూలి డబ్బులు వీళ్ల ఖర్చుపెట్టేస్తున్నారని వీరమ్మ బాధ!

"ఈరమ్మప్పా! మన కుటుంబాలలో విషయాలు నీకు తెలనివి ఏమున్నాయప్పా! పిల్ల అదని ఇదని ముచ్చటపడుతున్నది. దానికి సొమ్ము జతచేస్తున్నాము. నాలుగు సరుకులు అమరగానే తీసుకువత్తాము" మరియాదగా అన్నాడు యాదయ్య. "కోతలు మొదలవకముందే మాకోడలు మా యింటికి రావాలి! మీరు చేయించే సరుకు సప్పరా మాకేమీ అక్కర్లేదు" అని ధాంధూం అంటూ ఎగిరెగిరిపడుతూ వెళ్లింది వీరమ్మ. అప్పట్నించీ యాదాయి నర్సమ్మ రెక్కలు ముక్కలు చేసుకున్నారు. రెండు మేక పిల్లలుంటే వాటిని అమ్మారు. మట్టి పిడతలు పగులకొట్టేరు. అడుగు బడుగూ అన్నీ కలిపి నాలుగొందల యాభయి రూపాయిలు అయినాయి.

"పాలెంలో ప్రతి సరుకు రెట్టింపు ధరలు చెబ్తారు. మావయ్యా! బస్తీపోదాం నడు. అన్నీ కొనుక్కొని రావచ్చును." అన్నాడు సీతయ్య కొడుకు అప్పల నర్సిమ్మ. "రామాపోమా పుంజీడు రూపాయిలు అయిపోతాయి బస్సు చార్జీలు!" అన్నాడు సీతయ్య.

"చారిజీలు అవితేమటుకేం! సరుకు నికార్సయినది దొరుకుతాది. ఉదయాన్నే ఎల్లి మాపిటికి వచ్చేయొచ్చును" అన్నాడు నర్సిమ్మ.

"నీకు బస్తీ బాగా తెలుసురయ్యా! మీమావయ్యని జాగరతగా తోలుకెళ్లి సరుకులు అన్ని కొనుక్కోని బేగారండి" అంది నర్సమ్మ.

"మామూ వొత్తమయ్యా! సరదగ తిరిగొద్దారి ఓతూరి" అంటూ ఇంకా ఇద్దరు ఇరుగుపొరుగు యువకులు బయలుదేరారు. బస్తీ పదిమైళ్లుంటుంది. అడ్డతోవన కోసుడు దూరంలో పాలెం వున్నది. అక్కడ



అన్ని సరుకులూ దొరుకుతాయి. వారానికి పదిరోజులకి అంకంపల్లి వాళ్లంతా పాలింకు వెళ్లి సామాన్లు అన్నీ తెచ్చుకుంటూ వుంటారు. నర్సిమ్మ బస్తీలో రెండు మూడేళ్ళ రిక్షా బండి తొక్కుకునేవాడు. ఈమధ్య ఆరోగ్యం బాగాలేక తండ్రి వద్దకు వచ్చివుంటున్నాడు. పొలంపనులు చేసుకుంటున్నాడు. యాదాయి తిరుగుమోతూ తాగుబోతూ కాదు. కష్టపడి పని చేసుకుంటాడు. కలోగంజో వున్నదానితో తృప్తిగా బతుకుతూ వుంటాడు. నర్సమ్మ కూడా చాలా సాదాసీదా మనిషి! తొలిరోజు రాత్రికి రాకపోయినా నర్సమ్మ దిగులుపడలేదు. 'వెళ్లక వెళ్లక జన్మకు శివరాత్రిలా బస్తీకి వెళ్లాడు. సినిమాలేవో చూస్తూ కాలక్షేపం చేసి వుంటాడు!' అనుకొంది. మరునాడు సాయంకాలం బస్సుకు కూడా రాకపోయేసరికి నర్సమ్మకి దిగులు ఎక్కువయింది.

"ఏటి అచ్చిదానా! మీ అయ్య డబ్బుకాని పారేసుకోలేదుగందా!" అంది నర్సమ్మ కళ్ళు తుడుచుకుంటూ.

"అట్టా గనబోకే! ఇంకా ఎవురూ రావేదు గందా! నైటుబండికొత్తాడేమో!" అంది అచ్చాలు.

"నైటుబండికిరాడు. సీకట్లో బయలెల్లడు. ఇంక పొద్దుటె రావాల!" అంది. వెంకటుచీనయ్య గెంతుకుంటూ వచ్చారు. వాళ్ల చేతుల్లో అడుగు పొడుగున్న చెరుకు గడ ముక్కలున్నాయి.

"నాకీరా ఒకటి!" అంది అచ్చాలు. ఇద్దరు చెరిసగం ముక్కలు చేసి తల్లికొకటి అక్కకొకటి ఇచ్చేరు.

"ఆరుగంటల బస్సుకి అయ్యరానేదేటే!" అన్నారు వాళ్ళు. "మీకు అయ్యో,అయ్యో గోలే పట్టుకున్నాదీ! ఎల్లిన పన్లు చేసుకోకుండా ఎట్టగొత్తాడు!" అని కసిరింది అచ్చాలు. దానికీ మనసులో పీకుతూనే వుంది. ఆకుపచ్చ రంగు సీనారేకు పెట్టెలో తన బట్టలు, డబ్బులు, జడకుచ్చులు, గిల్టునల్లపూసల గొలుసు, పౌడరు డబ్బా పెట్టుకున్నట్లు కల కూడా వచ్చింది.

"ఎల్లిన్నాడే పారొస్తానన్నాడు గందా! బోలెడన్ని సరుకులు కొంటానన్నాడు!" అన్నాడు వెంకట.

"జత ఇత్తడి బిందెలు. చీరీ జాకిట్టు బట్టలు. పనద్దారమిటాయిలు. అర్టిపళ్లగెలా. కొబ్బరికాయిలూ ఇంకా..."

"మరిగంటె నాకు నిక్కరూ జోబీ చొక్కాయి కొంటానన్నాడు" అన్నాడు వెంకట.

"బట్టలు నాకూ తీత్తానన్నాడు. సినిమాలోలాంటి "బలీను" తీత్తానన్నాడు. బస్తీలో అది దొంగ్రదూ పాయిలట! సీతయ్య తాత చెప్పాడు" అన్నాడు చీనయ్య.

"నాకు గొబ్బిరుండలు కారప్పూస తెమ్మన్నాను అయ్యను. కొంటానన్నాడు!"

"నాకు మైసూరుపాకం జిలాబీ తెమ్మన్నాను. తెస్తాను అన్నాడు." ఇద్దరూ వాళ్ల వాళ్ల కోరికలు తీరబోయే తరుణంకోసం ఎదురుచూస్తున్నారు. చుక్కల్లోంచి నల్లటి ఆకాశం లోంచి పౌర్ణమి వెళ్లిన బహుళ పంచమి చంద్రుడు దొంగలా వస్తున్నాడు. చిన్న బుడ్డి దీపం వెలిగించి అరుగుమీద పెట్టింది అచ్చాలు. పిల్లలిద్దరూ నులకమంచం గుడిసె ముందుకు లాక్కుని అడ్డం పడ్డారు.

"అమ్మకూడొండవా ఇంక!" అంది అచ్చాలు.

"పొద్దుటి చోడి సంకటి వున్నది. తలొకముద్దా తినండి. నాకు పొయ్యి రాజెయ్య బుద్ది పుడతలేదు. గుబులు గుబులుగా వుంది." అన్నది నర్సమ్మ.

"సంకటి రెండు ముద్దలే వుంటాదమ్మా! నంజుకోటానికి బెల్లప్పిసరు కూడా నేదు. ఏటి తినమంటావు! కూడువండమ్మా! నువ్వు ఎసట్లో బియ్యం పోసేసరికి అయ్య వొచ్చేస్తాడు చూడు" అని బతిమిలాడింది తల్లిని అచ్చాలు.

"నామణుసు బాగులేదే పిల్లదానా! కూడొండు కూరొండు అని నన్ను మనేద పెట్టబాకు. కావిలిత్తే నువ్వు వండుకో ఆకూడూ కూరాను." అని విసుక్కుంది నర్సమ్మ.

"ఈళ్లెవరూ ఇంటిముకం పట్టలేదు. కూతురా! డబ్బంతా జూదమాడో తాగేసో తగిలెట్టేసుకుని వుంటారు. ఏందారి కూతురా!" అంటూ వొచ్చేడు

రాష్ట్రపతి సతీమణి శ్రీమతి జానకీ వెంకట్రామన్‌కు అన్నమాచార్య ట్రస్ట్ 'గిఫ్ట్ బాక్స్'ను ఇటీవల భారత రాష్ట్రపతి శ్రీ ఆర్. వెంకటరామన్, రాష్ట్ర గవర్నర్ శ్రీమతి కుముద్‌బెన్ జోషిల సమక్షంలో ట్రస్టీ శ్రీమతి డి. సీతాపద్మరాజు బహూకరిస్తున్న దృశ్యం

సీతయ్య.

"మా అయ్య అసుమంటాడుగాదు తాతియ్యా నాదితేసులన్నీ పొలెంలోనే కొనేద్దామనుకున్నాడు. అందరూ సావాసంగా వున్నారు గందా అని బస్తీకి వెళ్లాడు. ఏదో ఇబ్బందిలో పడుంటారు అందల ఒకళ్లు. ఆళ్ల గురించి తక్కినోళ్లు కూడా వుండిపోయుంటారు" అంది అచ్చాలు. "పోనీ ఎల్లి ఎతుకుదామన్నా రాకకీ పోకకీ పుంజీడు రూపాయిలన్నా వుండాల. రేలు బవలూ కట్టంబడిన రూపాయిలను ఈ పనికిమాలినోళ్లని ఎతుకులాటకి కరుసు చేయనా అని బాధగా వుండాది. నైటు బండికి రాకపోతే పొద్దుటేల పట్టుబండికి వేబోయెస్తాను కాని దిగులుపడబాకండి. కుశాలుగా వుండండి. ఒక్కడంటె ఒక్కడన్న ఇంటికి తగలడలేదు. వుండాకోరు ఎదవలు!" విసుక్కున్నాడు సీతయ్య.

రాత్రి నైటు బండి కూడా చూసేరు వాళ్లు. కాని బస్తీకి వెళ్లిన వాళ్లు రాలేదు. నర్సమ్మకు కళ్లు మూతలు పడలేదు. "సొమ్ముపోతే పోనాది ఆడిపొనం సుఖంగా వుండేట్టు చూడు నూకాలల్లి! నీకు కోడిని వేత్తాను." అంటూ రాత్రి తెల్లవార్లూ ఆకాశంకేసి చూస్తూ మన సులోనే మొక్కుబడులు పెట్టుకుంటూ జాగారం చేసింది నర్సమ్మ. అచ్చాలుకు తాను పనద్దార మిటాయిలు బిందెలనిండా సర్దుతున్నట్లూ, ఆ బిందెల చుట్టూ కాకులుచేరి కావుకావుమంటూ అరుస్తూ మిటాయిలన్నింటినీ ముక్కులతో పొడిచి పొదుంపొదుం చేసి ఇల్లంతా చిందరవందరగా పోసేసినట్లు కలగాసింది. కావు కావుమంటూ కాకుల అరుపులకి త్రుళ్లిపడి లేచింది అచ్చాలు. మిఠాయిలు, మెరిసే కొత్త ఇత్తడి బిందెలూ లేవు. కాకుల గోలమటుకు చెట్లమీద నించి వినబడుతోంది. భళ్లున తెల్లవారింది. "ఇదంతా కలేనా!" అనుకుంటూ నిబ్బరంగా గుండెలమీద చేయి వేసుకుంది అచ్చాలు. కాని గుండెలు దడదడలాడు తున్నాయి.

* * *

"ఏయ్! చెప్పండ్రా లం.కొడకల్లారా! అర్ధరాత్రి బజార్లల్ల ఎందుకు తిరుగుతున్నారు! మీ లీడరెవరు?" బూటు కాళ్లతో యాదాయిని, నర్సిమ్మనీ, మిగిలిన ఇద్దరు యువకులనీ డొక్కలో తన్నసాగారు ఇద్దరు కానిస్టేబుల్స్.

"మాకు లీడరు ఎవురూనేరు బాబియ్యా. పిల్లదానికి అత్తారింటికి అంపకం పెట్టటానికి సరుకులు కొనాలని బస్తీకి వొచ్చాము. కరెంట్ దీపాలల్లో బజారు బాగుంటా దని ఈడు అన్నాడు. బొమ్మ చూస్కాని బజార్లో ఏదన్నా అరుగుమీద తొంగుండి పోదామని చూస్తున్నాం. ఇంతలో పోలీసుబాబులు మా మీద పడ్డారు. మమ్మల్ని వదిలెయ్యండి బావూ! మూడ్రోలాయి పోయింది. ఇళ్లకాడ పెళ్లాంబిడ్డలు బెగిలిపోతారు బావూ!"

"కథలు చెప్తార్రా మీరు! గోచిగుడ్డలు కూడా లేవు మీకు తిన్నగా! నాలుగొందలు అయిదొందలు మొలలో దాచారంటె మీ అబ్బగాడి సొమ్మంట్రా! దొంగ నాయాళ్లల్లారా!" మళ్లీ కుళ్ల పొడిచారు. యాదాయి కాళ్లు చేతులు అన్నీ వాచిపోయేయి. "పల్లెటూరెదవలు బస్తీలు పొంొచ్చి బజార్లలో జేబులు కొట్టి డబ్బులు జల్సా చేస్తారు. నాకెరిక కాదనుకున్నార్రా! ఎదవల్లారా!"

"బావు, బావు అట్లనమాకండి. బావు! మేము అంకంపల్లిలో గొర్నంగా బతుకుతున్నవోళ్లం. దొంగలం కాము. బూవిదున్నుకుని బతికేటోల్లం! పయిస పయిస

దాపెట్టి బొట్టికి అత్తోరికి అంపకం పెట్టాలని సరుకులు కొనేటందుకు వొచ్చినాము. ఇదేమి బస్తీయో! బయలెల్లిన వేళ ఎవురి ముకం చూసామో! మీ పాల బడ్డాము. మూ(డోలాయి కుళ్లబొడిచేస్తున్నారు. ఏందారి దేముడా!" అంటూ ఏడవసాగాడు యాదాయి.

"వానింపి ఇదంతా వొచ్చింది మావయ్యా. నైటుకి వుండి సిన్మా చూద్దారని లబలబలాడేను. రాంగానే కావిల్సినవి కొనుక్కుని ఎల్లిపోతే ఈళ్లగూట్లో పడుండక పోదుము." అంటూ తన్ను తాను నిందించుకున్నాడు నర్సిమ్మ.

"మన కరమ ఇదంతా! దిమాగ్గా తిరుగుదారని మనం వొచ్చేటేంది! దొంగలనుకుని కొట్లో బడేసి ఈళ్లు వొళ్లు చీరేయటమేంది! మావు యాడా చూళ్లేదు." అంటూ ఏడుస్తు న్నారు మిగిలినవాళ్లు.

"మూ(డోలాయిపోయే! ఇంక మమ్మల్ని పోనీయండి బావూ! మీకు నమ్మకం లేకపోతే అంకంపల్లి రాండి. మాము ఎసుమంటోల్లమో మీ కెరిక ఐతాది. ఆడోళ్లు లబలబలాడిపోతారు బాబూ!" అంటూ కాళ్లావేళ్లా పడ్డారు యాదాయి, నర్సిమ్మ. కానిస్టేబుల్స్ స్టేషన్ వరండామీదకు పోయి గుజగుజలాడేరు. "మీ గురించిన వివరాలు అన్నీ మా బుక్సులో వుంటాయి. మిమ్మల్ని వదిలెయ్యాలంటే కోర్టు కేసులూ లేకుండా చేయాలంటే మడిసికి వందరూపాయిలు చొప్పున ఇచ్చుకోండి. లేకపోతే తాగి ఆడోళ్లని తీసుకుని లాడిజి గుల్లో వున్నారని (వాసేస్తారు పైవోళ్లు. ఆళ్ల బుక్కుల్లోకి ఎక్కారంటె చూసుకోండి. బాబులూ! మీ ఫోటోలు తీయించి ఈ కేడీగాళ్లుండే బోరుదుమీద అంటించేస్తారు. మరియాద నిలవాల్నంటే పై వాళ్ల నోటీసుల్లోకి ఎక్కకూడదు. కాస్సేపటికి ఇన్స్పెక్టరు వత్తారు. వచ్చి మీ ఇలాకా అడిగారంటే ఏదయినా చెప్పాల్సిన జవాబు వారీ మామీద వుంటుంది" అన్నాడు. ఆ మాత్రం దోవ దొరికినందుకు (బహ్మానందపడిపోయేడు అప్పల నర్సిమ్మ.

"మావియ్యా. ఇంటికెళ్లాక అందరం ఇచ్చేత్తాం ముందల నీ దగ్గరున్న డబ్బు ఈళ్ల ఎదాన కొట్టేయి. బయట పడిపోతాం" అన్నాడు. యాదాయికి చేతులు వణికేయి.

"వణికి ఛస్తావేంరా! అబ్బ వాకారిఎదవా! బజార్లు దొబ్బినప్పుడు రాలేదా వణుకు! తీయి డబ్బు పంచి! మళ్లీ మా యముడు వచ్చేడంటే ఇందులో సగంవాడే గుటకాయస్వాహా చేస్తాడు." అంటూ ఒక పోలీసు యాదాయి డొక్కలో ఒక పోటు పొడిచేడు చేతి క(రతో! అయిదువందలు వాళ్లకి ధారపోసి పల్లెమొగం పట్టారు యాదాయి వాళ్లు.

అయిదు రూపాయిల నోట్లు పది రూపాయిల నోట్లు రెండు రూపాయిల నోట్లు రూపాయి కాయితాలు అన్నీ విడివిడిగా చూసి లెఖ్ఖ పెట్టుకుంటున్నారు.

"ఎందరి జేబులు కొట్టారో లమ్డీకొడుకులు. దరిజాగా తిరిగేద్దాం అనుకుంటున్నారు." అన్నాడు ఒక పోలీసు.

"ఈ మధ్య (పతి వెధవ అమాయకుడిలా నటించడం మొదలుపెట్టారు. ఈ డబ్బులన్నీ పోగుజేసి యే చెట్టు(కిందో జేరి జూదమాడుకుంటారు. లేకపోతే పీకల దాకా తాగి రోడ్డుకి అడ్డదిడ్డంగా పడటం, ఏ లారీయో మట్టేసిందంటే ఇంక మళ్లీ మనకి సందడి!" అన్నాడు ఇంకొకడు.

"దుక్కముక్కల్లా వున్నారు. వొళ్లు వంచి పని చేసుకోకూడదూ! మూ(డోజులు తిండి లేకుండా మాడినా నల్లని శానిరాయిలా ఎన్ని దెబ్బలయినా కాసేరు. ఇలగిలాంటోళ్లనే ఆళ్లు పారిటీలలోకి జేరుత్తన్నారు. ఎంత కుళ్ల బొడవనీ నోరిప్పరు. జాడ పట్టేయరు. మనపై మొగుళ్లు 'ఎదవల్లారా ఆళ్లచేత ఒక మాటన్నా పలికించలేకపోయా(రా సన్నాసి ఎదవల్లారా! మీ ఆడోళ్లకి ఇడాకులిచ్చేయండి. ఆళ్లన్నా సుకపడతారు' అంటూ దెప్పిపొడుస్తారు. ఈళ్లని గట్టిగా తన్నామనుకో. టప్పమని చచ్చూరుకుంటున్నారు. ఇంక చూసుకో నాయినా! లాకెప్పులో హత్య అంటూ పేపరోళ్లు ఏకేయటం! పోలీసుద్యోగం చేయటం కన్నా పుణుకులు అమ్ముకుంటం నయిం" అన్నాడు ఇంకొకడు.

"ఏదోలే! ఆళ్లకర్మాన్న ఆళ్లు పోయేరు. మనకింత దొరికింది. ఎపుడు ఏపారిటి అయితే మనకేమిటి! జీతంరాళ్లతో ఏదో పై సంపాదన వుంటుందనేగా ఉద్యోగం చేయటం!" అన్నాడింకొకడు.

"మా నాయిన హెడు సేసినాడు. ఆయినంటే వూళ్లంతా గజగజలాడేవారంట! వూరిలో ఎవురు వేట వేసుకున్నా హెడుగారికంటూ మాంసం పంపేరుట. మాంసం, కోడి, చేపలు ఎప్పుడూ కొనుక్కోని ఎరగం. ఇప్పుడో! అందరూ పోలీసులని తిట్టేవోరే కాని గౌర్నంగా చూసి ఆకో, పండో ఇచ్చేవాడే లేదు. మా నాయిన డెబ్బయి రూపాయిల జీతంతో నలుగురక్కయ్యలకీ పెళ్లిళ్లు చేసేడు. పాతికేలు పెట్టి డాబా కట్టేడు. మూడు పెళ్లిళ్లు చేసుకున్నాడు. ఇంకా నలబయి ఏళ్ల నడివయసు వాడులా వుంటాడు మా నాయిన."

'సమాచారం' సంస్థాపక (1956) సంపాదకులు కీర్తిశేషులు గంధం సీతారామాంజనేయులు చి(తపటాన్ని జనవరి 10న రాజమం(డిలో "ఆం(ధ(పభ' సంపాదకులు శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు ఆవిష్కరించిన సందర్భంలో తీసిన చి(తమిది. ఇందులో సర్వశ్రీ పొత్తూరి (చి(తపటానికి ఎడమ(పక్క), గంధం సు(బహ్మణ్యం, 'ఆం(ధజ్యోతి' వారప(తిక సంపాదకులు శ్రీ పురాణం సు(బహ్మణ్యశర్మ (పభృతులు వున్నారు.

"నువ్వా! ఘాపిటికో రేపటికో రాలిపోయేలా వుంటావు. నువ్వు తిన్న మాంసమూ కోళ్లా చేపలూ ఏసం(దంలోకి పోయేయిరా! నక్క నాకొడకా!" అన్నాడు ఇంకొకడు. వాళ్లల్లోవాళ్లు నవ్వుకొంటున్నారు హాయిగా తీయగా. చాలా హుషారుగా వున్నారు వాళ్లు! (పజలు వాళ్లని గౌరవించి తృణమో ఫణమో భక్తిగా భయంగా ఇవ్వటం మానేశారు. వాళ్లు మటుకు ఏమి చేస్తారు? వాళ్లకీ కుటుంబాలున్నాయి. కాదా మరీ!

* * *

"అయ్యొచ్చేడు! అమ్మోవ్. అయ్యొచ్చేత్తన్నడు." అంటూ వెంకటం, చీనయ్య గోలగోలగా అరవటంతో వూరువూరంతా రోడ్డుమీదకు వచ్చింది. మూడు రోజులు ఇంటికి రాకపోయేసరికి అందరికీ వాళ్లమీదే దృష్టివుండినాది.

ఆకుపచ్చరంగు చీనారేకు పెట్టె, మిలమిలమెరిసే బంగారంలాంటి రెండు ఇత్తడి బిందెలు, వాటినిండా పనద్దార మిటాయుండలు, చీరలు జాకిటు ముక్కలు, అర్టిపళ్లగెల, కొబ్బరికాయలు– వాట్లకోసం యాదాయి కుటుంబం కళ్లు విప్పుకుని చూస్తోంది. పొగ మారి పోయిన కొరకంచు ముక్కల్లా పీచురేగిపోయిన తలతో ఎ(రగా మండుతున్న కళ్లతో దుమ్ముకొట్టుకున్న శరీరంతో చేతులు కాళ్లు వాచిపోయి వున్న యాదాయి తన వూళ్లో వాళ్ల చూపుల్ని ఎదుర్కోలేకపోయాడు.

తాను తాగలేదని జల్సాలు చేయలేదని జూదమాడ లేదనీ తనకే తెలుసును. తాను బజార్లమ్మట తిరిగి సొమ్ము జారవిడుచుకోలేదని తనకే తెలుసును. కాని ఇంతమందికీ తామ్ము పొందిన అవమానము బాధా తిట్లు దెబ్బలూ ఎలా చెప్పకునేది! ఏమని చెప్పకునేది!

అందుకే...అందుకే...రోడ్డుమీదే కూలబడి రెండు చేతులూ నెత్తిమీద పెట్టుకుని భోరుమని ఏడవసాగేడు యాదాయి. అందరూ వాడి చుట్టూ గుమిగూడారు.

●